RNI : APTEL / 2023 / 89152

Happy Work Anniversary. 1st Year

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

Good for Health — Best for Readers — THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 190 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 03 జూన్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 190 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 03 June 2025 PAGES : 8 PRICE : 3/-



# ఐపిఎల్ 2025 ఆర్సీబీ కైవసం



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, జూన్ 3)

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన ఐపీఎల్ 2025 ఫైనల్ సమరంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) చరిత్ర సృష్టించింది. పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్)తో జరిగిన హోరాహోరీ పోరులో విజయం సాధించి, తమ 18 ఏళ్ల సుదీర్ఘ ఐపీఎల్ టైటిల్ నిరీక్షణకు తెరదించింది. ఆర్సీబీ ఎట్టకేలకు తమ మొట్టమొదటి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. ఈ విజయంతో బెంగళూరు అభిమానుల దశాబ్దాల కల నెరవేరింది. ఐపీఎల్ ఆరంభం నుంచి టైటిల్ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఎట్టకేలకు తమ లక్ష్యాన్ని చేరుకుంది. మంగళవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ 2025 ఫైనల్ పోరులో పంజాబ్ కింగ్స్‌పై సమష్టి ప్రదర్శనతో విజయం సాధించింది. 2008 నుంచి ఊరిస్తున్న ఐపీఎల్ ట్రోఫీని 18వ ప్రయత్నంలో సొంతం చేసుకుంది. ఈ చారిత్రక విజయంతో ఆర్సీబీ ఆటగాళ్లు, యాజమాన్యం, కోట్లాది మంది అభిమానులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు.

## 18
## ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర

- ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌పై ఆర్సీబి గెలుపు
- విరాట్ కోహ్లీ చిరకాల స్వప్నం సాకారం
- అహ్మదాబాద్‌లో బెంగళూరు అభిమానుల సంబరాలు

**లక్ష్యఛేదనలో తడబడ్డ పంజాబ్**

191 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు శుభారంభం దక్కింది. ఓపెనర్లు తొలి 3.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 31 పరుగులు జోడించారు. అయితే, ఐదో ఓవర్‌లో జోష్ హేజిల్‌వుడ్ పంజాబ్‌ను దెబ్బతీశాడు. 24 పరుగులు చేసిన ప్రియాంశ్ ఆర్యను అవుట్ చేయడంతో పంజాబ్ 43 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం ఆర్సీబీ బౌలర్లు క్రమంగా పట్టు బిగించారు. పంజాబ్ ఇన్నింగ్స్ 15 ఓవర్లు ముగిసేసరికి 4 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. ఆ సమయంలో క్రీజులో శశాంక్ సింగ్ (9 బంతుల్లో 10), నెహాల్ వధేరా (13 బంతుల్లో 14) ఉన్నారు. చివరి 30 బంతుల్లో పంజాబ్ విజయానికి 72 పరుగులు అవసరమవగా, అప్పటికే అవసరమైన రన్ రేట్ 14.40కి చేరింది. ఈ దశలో ఆర్సీబీ బౌలర్లు అద్భుతమైన క్రమశిక్షణతో బౌలింగ్ చేసి పంజాబ్ బ్యాటర్లపై తీవ్ర ఒత్తిడి పెంచారు. భారీ షాట్లు ఆడే క్రమంలో పంజాబ్ కింగ్స్ వరుసగా వికెట్లు కోల్పోయింది. దీంతో నిర్ణీత ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. ఆర్సీబీ బౌలర్ల సమష్టి కృషితో పంజాబ్ బ్యాటింగ్ లైనప్ కుప్పకూలింది. దీంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. చివరి ఓవర్లో శశాంక్ సింగ్ సిక్సర్ల మోత మోగించినప్పటికీ, పంజాబ్ కింగ్స్ విజయానికి 6 పరుగుల దూరంలో ఆగిపోయింది. శశాంక్ సింగ్ 30 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 61 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు.

**కోహ్లీకి ఆనందం... శ్రేయాస్‌కు నిరాశ!**

ఆర్సీబీ తరఫున ఆరంభం నుంచి ఆడుతున్న విరాట్ కోహ్లీకి ఈ విజయం ఎంతో ప్రత్యేకం. గతంలో మూడుసార్లు ఫైనల్ చేరినా, టైటిల్ గెలవలేకపోయిన ఆర్సీబీకి, కోహ్లీ నాయకత్వ పటిమ, అద్భుత ఆటతీరు ఈసారి ట్రోఫీని అందించడంలో కీలక పాత్ర పోషించాయి. మరోవైపు, పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు ఇది మూడో ఐపీఎల్ ఫైనల్ అయినప్పటికీ, మరోసారి నిరాశే ఎదురైంది. రెండు జట్లు తమ తొలి టైటిల్ కోసం తీవ్రంగా పోరాడిన ఈ మ్యాచ్, చివరికి ఆర్సీబీకి చిరకాల స్వప్నాన్ని నెరవేర్చింది. ఈ విజయంతో ఆర్సీబీ క్యాంప్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. కాగా, చివరి ఓవర్లో ఆర్సీబీ విజయం ఖరారు కాగానే, కోహ్లీ కన్నీటి పర్యంతం అయ్యాడు. ఎన్నో ఏళ్లుగా దక్కని విజయం, ఇన్నాళ్లకు దక్కిందన్న భావోద్వేగాలతో కోహ్లీ కంటతడి పెట్టాడు. ఈ ఫైనల్ మ్యాచ్‌కు బ్రిటన్ మాజీ ప్రధాని, బెంగళూరు అల్లుడు రిషి సునాక్ సతీసమేతంగా హాజరయ్యారు. స్టేడియంలో ఆయన ఆర్సీబీకి సపోర్ట్ చేస్తూ కనిపించారు. బెంగళూరు టీమ్ ను అడుగడుగునా ప్రోత్సహిస్తూ ఆయన మ్యాచ్ ను బాగా ఎంజాయ్ చేశారు. ఇలాంటి క్రికెట్ అనుభూతిని ఎప్పుడూ పొందలేదని రిషి సునాక్ వ్యాఖ్యానించారు.




# బీఎస్ఎఫ్ జవాను భూ సమస్యను 24 గంటల్లో పరిష్కరించాం

- బీఎస్ఎఫ్ జవాను భూ సమస్యపై మంత్రి లోకేశ్ తక్షణ స్పందన
- 24 గంటల్లోనే శ్రీ సత్యసాయి జిల్లా జవానుకు ఊరట
- వైసీపీ నేత కబ్జా చేసిన రెండెకరాల భూమికి విముక్తి
- సెల్ఫీ వీడియో ద్వారా జవాను ఆవేదన, రంగంలోకి దిగిన అధికారులు
- సర్వే చేసి, పోలీసుల సమక్షంలో హద్దులు నిర్ణయించి సమస్య పరిష్కారం



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 03)

శ్రీ సత్యసాయి జిల్లా, అమరాపురం మండలం, ఉదుకూరు గ్రామానికి చెందిన డి. నరసింహమూర్తి ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో బీఎస్ఎఫ్ జవానుగా దేశ సేవలో ఉన్నారు. ఆయన సతీమణి తల్లిదండ్రులకు చెందిన రెండెకరాల భూమి అమరాపురం మండలం కె.శివరం గ్రామంలో ఉంది. అయితే, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన నాగరాజు అనే వ్యక్తి, తన రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని ఈ భూమిని అక్రమంగా కబ్జా చేశారని నరసింహమూర్తి ఆరోపించారు. సరిహద్దుల్లో ఉంటూ తన కుటుంబానికి న్యాయం -మిగతా 2లో

# భారత్ వెంటే బ్రిటన్

- ఉగ్రవాదంపై పోరాటానికి మద్దతు
- సమూల నిర్మూలనకు అఖిలపక్ష బృందాల పిలుపు
- కొనసాగుతున్న పర్యటన

లండన్‌లోని టావిస్టాక్ స్క్వేర్‌లో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద భాజపా ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం. చిత్రంలో ఎంపీ పురందేశ్వరి తదితరులు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 03)



లండన్, కైరో, కౌలాలంపూర్: ఉగ్రవాదంపై పోరాటంలో భారత్ వెంటే నిలుస్తామని బ్రిటన్ హామీ ఇచ్చింది. పహల్గాం ఉగ్ర దాడిని ఖండించింది. మరోవైపు ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ప్రపంచం ఏకం కావాలని మన అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందాలు -మిగతా 2లో

# మేము మీ భాగస్వామిగా ఉంటాం.. చైనాకు యూనస్ విజ్ఞప్తి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 03)

చైనా అత్యధిక పెట్టుబడులు పెడితే తమ దేశ ఆర్థికవ్యవస్థ మలుపు తిరుగుతుందని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ పేర్కొన్నారు. చైనా- బంగ్లా వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించిన సదస్సును యూనస్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



బంగ్లాదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి చైనా వాణిజ్యమంత్రి వాంగ్ వెంటావో ప్రత్యేకఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా యూనస్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా తయారీరంగంలో చైనా కంపెనీలు పేరుగాంచాయన్నారు. చైనా తో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. -మిగతా 2లో

# 'యోగా డే'పై ప్రజా స్పందన ఉత్సాహాన్నిస్తోంది

- జూన్ 21న యోగా డే
- విశాఖలో 5 లక్షల మందితో యోగా కార్యక్రమం
- రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 03)

ఈ నెల 21వ తేదీన ఏపీలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా డే కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన రిజిస్ట్రేషన్లు, జిల్లాల్లో జరుగుతున్న యోగా సాధన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం సంతృప్తికరంగా ఉందని తెలిపారు. పూర్తి స్థాయి సన్నద్ధతతో, ప్రజల భాగస్వామ్యంతో అత్యధిక మందితో యోగా నిర్వహించి గిన్నీస్ వరల్డ్ రికార్డు సృష్టించాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలని సీఎం నిర్దేశించారు. జూన్ 21న విశాఖలో 5 లక్షలమంది పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా జరగాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ పరంగా ఆంక్షలు ఉంటాయని... వీటిని దృష్టిలో పెట్టుకుని ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం అన్నారు. అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు యోగా డే కార్యక్రమానికి వస్తారని... ఎవరు ఎటు వెళ్లాలి... ఎక్కడ కార్యక్రమంలో పాల్గొనాలి... అనే విషయంలో ముందుగానే గైడ్ చేయాలని సీఎం అన్నారు. ట్రాఫిక్ సహా ఏ ఇబ్బందీ ఉండకూడదు... అందరూ నిర్దేశించిన ప్రాంతానికి చేరుకునేలా చూడాలని స్పష్టం చేశారు. యోగా డే కంటే ముందు రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో భారీగా ప్రీ ఈవెంట్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. "7వ తేదీ ప్రతి గ్రామంలో, ప్రతి ప్రాంతంలో యోగా డే అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తారు. 14 వతేదీ -మిగతా 2లో

## మొదటి పేజీ తరువాయి

# బీఎస్ఎఫ్ జవాను భూ సమస్యను 24 గంటల్లో పరిష్కరించాం

చేయలేకపోతున్నాననే ఆవేదనతో, ఆయన జమ్మూకశ్మీర్ నుంచే ఓ సెల్ఫీ వీడియో ద్వారా తన గోడును వెళ్లబోసుకున్నారు. తనకు న్యాయం చేయాలని, తన భూమిని తనకు ఇప్పించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

**మంత్రి లోకేశ్ చొరవ... చకచకా కదిలిన అధికారులు**

ఈ సెల్ఫీ వీడియో మంత్రి నారా లోకేశ్ దృష్టికి రావడంతో ఆయన తక్షణమే స్పందించారు. దేశం కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న సైనికుడికి అన్యాయం జరగడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో స్వయంగా మాట్లాడి, భూ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, జవాను కుటుంబానికి న్యాయం చేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఉరుకులు పరుగుల మీద రంగంలోకి దిగింది. అమరాపురం తహశీల్దార్, స్థానిక పోలీసు అధికారులు కె.శివరం గ్రామానికి చేరుకుని, వివాదాస్పద భూమిని క్షుణ్ణంగా సర్వే చేశారు. రికార్డులను పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించుకున్నారు. అనంతరం, పోలీసుల సమక్షంలో భూమికి హద్దులు ఏర్పాటు చేసి, జవాన్ నరసింహామూర్తి కుటుంబానికి ఆ భూమిని అప్పగించారు. దీంతో, గత కొంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ భూ వివాదానికి కేవలం 24 గంటల్లోనే శాశ్వత పరిష్కారం లభించింది.

**సైనికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మంత్రి లోకేశ్**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో స్పందించారు. "దేశ రక్షణలో నిరంతరం శ్రమిస్తున్న మన సైనికుల సంక్షేమానికి, వారి కుటుంబాల రక్షణకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. సరిహద్దుల్లో దేశం కోసం పోరాడుతున్న జవాను తన భూమి కోసం ఆవేదన చెందాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం. నరసింహామూర్తి ఆవేదన నా దృష్టికి వచ్చిన వెంటనే అధికారులను అప్రమత్తం చేసి, 24 గంటల్లో సమస్యను పరిష్కరించాం. సైనికులకు ఎలాంటి సమస్య తలెత్తినా, మా ప్రభుత్వం తక్షణమే స్పందించి అండగా నిలుస్తుంది" అని పునరుద్ఘాటించారు.

# 'యోగా డే'పై ప్రజా స్పందన ఉత్సాహాన్నిస్తోంది

రాష్ట్రంలో లక్ష ప్రాంతాల్లో యోగా ప్రాక్టీస్ చేస్తారు. ప్రతి విద్యా సంస్థతో పాటు అవకాశం ఉన్న అన్ని సంస్థలు, ప్రాంతాల్లో 14వ తేదీ యోగా నిర్వహించి యోగా డేకు ప్రజలను సిద్ధం చేస్తారు. తద్వారా యోగా డే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనేలా చేయాలి" అని సీఎం వివరించారు.

మంగళవారం ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో యోగా డే కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ఈ సమీక్షకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్, వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, సత్యకుమార్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హాజరయ్యారు. యోగా మంత్‌లో భాగంగా ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాలను, యోగా డే నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రోజుకో థీమ్‌తో వివిధ వర్గాల ప్రజలతో జిల్లాల్లో నిర్వహిస్తోన్న కార్యక్రమాలకు వస్తున్న స్పందనను అధికారులు వివరించగా... చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. 21వ తేదీన విశాఖలో వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా చేసేందుకు జర్మన్ హ్యాంగర్లతో మరో వేదిక సిద్ధ చేసినట్లు అధికారులు తెలిపారు.

**ప్రతి గ్రామం నుంచి యోగా రిజిస్ట్రేషన్లు**

ఏర్పాట్లపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు వివరిస్తూ..."ప్రతి గ్రామం నుంచి యోగాలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అనుకున్న లక్ష్యానికి మించి ఔత్సాహికులు రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. యోగా కార్యక్రమంలో మూడు రోజుల పాటు పాల్గొనేవారికి సర్టిఫికెట్లు ఇస్తున్నాం. యాప్ ద్వారా కూడా ప్రజలు యోగా సర్టిఫికెట్ పొందవచ్చు. విద్యార్థులు, మహిళలు, డ్వాక్రా సంఘాలు, సామాన్య ప్రజలు... ఇలా అన్ని వర్గాలు విశాఖ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రెండు కోట్లమంది రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో యోగా కార్యక్రమంలో పాల్గొంటారని అంచానా వేస్తున్నాం. రెండు కోట్ల మందికి రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా... ఇప్పటి వరకు 1.77 కోట్ల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. మొత్తం 2,600 మంది మాస్టర్ ట్రైనర్లు సిద్ధం చేయాలని లక్ష్యం పెట్టుకోగా... 5,353 మందిని గుర్తించాం. వీళ్ల ద్వారా 1.25 లక్షల మందిని ట్రైన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా... 1.48 లక్షల మందికి ట్రైనింగ్ ఇచ్చారు. మూడు పాటు యోగా సాధన చేసిన వారికి ఆటోమేటిక్ గా సర్టిఫికెట్ వేళ్లేలా ఏర్పాట్లు చేయడం జరిగింది. అదే విధంగా కాంపిటేషన్స్ విషయంలో కూడా అనుకున్న మేర లక్ష్యాలను చేరుకున్నాం" అని సీఎం చంద్రబాబుకు వివరించారు.

# భారత్ వెంటే బ్రిటన్

పిలుపునిచ్చాయి. సోమవారం వివిధ దేశాల్లోని పలు వర్గాలను మన బృందాలు కలిసి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ తీరును ఎండగట్టాయి. ఉగ్రవాదంపై భారత్ పోరాడుతున్న తీరును వివరించాయి. ఇంగ్లాండ్ రాజధాని లండన్‌లో భాజపా ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని బృందం.. ఇండో–పసిఫిక్ మంత్రి క్యాథరీన్ వెస్ట్‌తో భేటీ అయ్యింది. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్ వెంటే నిలుస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఇండో–పసిఫిక్‌లో భారత్ భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. ఉగ్ర చర్యలకు పాల్పడేవారిని చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని స్పష్టం చేశారు. దీనిని నిర్మూలించడానికి అన్ని దేశాలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. లండన్‌లోని కొంత మంది మేధావులతోనూ మన బృందం భేటీ అయింది. అంతకుముందు మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ అంబేడ్కర్‌లకు నివాళులర్పించింది. హైకమిషన్‌లో ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయ సమ్మేళనంలోరవిశంకర్ ప్రసాద్ మాట్లాడారు. 1947లోనే పాకిస్థాన్ ఉగ్రవాదానికి ఊపిరులూదిందని, అప్పట్లోనే 5,000 మందిని కశ్మీర్‌లోకి పంపిందని బృంద సభ్యుడైన ఎంజే అక్బర్ పేర్కొన్నారు.

భాజపా ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలోని బృందం.. అల్జీరియాలో సోమవారం తన పర్యటనను ముగించింది. ఈ బృందం బహ్రెయిన్, కువైట్, సౌదీ అరేబియా, అల్జీరియాలో పర్యటించింది. అల్జీరియా విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ మహమ్మద్ ఖౌనేతో ఆదివారం రాత్రి మన బృందం భేటీ అయింది. ఉగ్రవాదంపై పోరాటంలో రెండు దేశాలు కలిసి పని చేయాలని నిర్ణయించాయి.

మలేసియాలోని కౌలాలంపూర్‌లో జేడీయూ ఎంపీ సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలోని బృందం.. డెమోక్రటిక్ యాక్షన్ పార్టీ నేత కులా సెగరన్, ఉప మంత్రి పార్టీ కీదిలన్‌తో సమావేశమైంది. మలేసియన్ ఇండియన్ కాంగ్రెస్ నేతలతోనూ భేటీ అయింది. సీమాంతర ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి వారంతా మద్దతిచ్చారు.

ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే నేతృత్వంలోని బృందం.. ఈజిప్టులోని ఉభయ సభల సభ్యులతో సమావేశమైంది. భారత్‌కు సెనెట్ మద్దతు పలికింది. వ్యూహాత్మక భాగస్వామ్య ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకుంది.

ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి స్పెయిన్ గట్టి మద్దతు పలికింది. స్పెయిన్‌లో పర్యటిస్తున్న బృందానికి డీఎంకే ఎంపీ కనిమొళి నేతృత్వం వహిస్తున్నారు. ఈ బృందం.. సోమవారం స్పెయిన్ విదేశాంగశాఖ మంత్రి జోస్ మాన్యుయేల్ అల్బేర్స్‌తో భేటీ అయింది.

లైబీరియాలో శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే నేతృత్వంలోని బృందం పర్యటిస్తోంది. మన్రోవియాలో ప్రవాస భారతీయులతో ఆదివారం సాయంత్రం ఈ బృందం భేటీ అయింది.

విదేశాలకు వెళ్లిన పార్లమెంటరీ ప్రతినిధి బృందాలు.. స్వదేశానికి రాగానే ప్రధాని మోదీతో భేటీ కానున్నాయి. ఏడు బృందాలు మంగళవారం నుంచి ఒక్కొక్కటిగా స్వదేశానికి రానున్నాయి.

# మేము మీ భాగస్వామిగా ఉంటాం.. చైనాకు యూనస్ విజ్ఞప్తి

తమ దేశంలో బీజింగ్ పెట్టుబడులు పెడితే దేశ ఆర్థికవ్యవస్థ మలుపు తిరుగుతుందన్నారు. ఇక, దేశ ఆర్థికవృద్ధిని మెరుగుపరిచి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా తాము ఉన్నట్లు తెలిపారు. పెట్టుబడులు మెరుగుపరచడం, చట్టాలను క్రమబద్ధీకరించడం, వ్యాపార కార్యకలాపాలకు అనుకూలమైన వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు వెల్లడించారు. ఇరుదేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈసందర్భంగా బంగ్లాదేశ్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని చైనా కంపెనీలకు సూచించిన ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌కు యూనస్ కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఇటీవల యూనస్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కూడా భేటీ అయ్యారు. బంగ్లా ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి చైనా నుంచి పెట్టుబడులను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తీస్తా నది సమగ్ర నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్ట్ లో పాల్గొనడానికి చైనా కంపెనీలను బంగ్లాదేశ్ స్వాగతించింది. డ్రాగన్ ఇస్తున్న రుణాలకు వడ్డీలను తగ్గించాలని, ఆ దేశ నిధులు అందుతున్న ప్రాజెక్టులకు కమిట్‌మెంట్ ఫీజ్‌ను మాఫీ చేయాలని, పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

# భారత్‌ను టార్గెట్ చేసేవారికి దూరంగా ఉండండి

## కెనడా మాజీ ప్రధాని

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 03)



భారత్ ను టార్గెట్ చేస్తున్న వేర్పాటువాద శక్తులతో సంబంధాలు తెంచుకోవాలని కెనడా మాజీ ప్రధాని స్టీఫెన్ హార్పర్ దేశంలోని రాజకీయ పార్టీలకు సూచించారు. కెనడాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ..ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలనుకునే ఏ పార్టీ అయినా భారత్‌తో సమస్యలు సృష్టించిన వేర్పాటువాదులతో సంబంధాలు తెంచుకోకపోతే న్యూదిల్లీతో.. కెనడా ఎప్పటికీ స్నేహపూర్వకమైన, బలమైన సంబంధాలను కొనసాగించలేదన్నారు. భారత్‌ను విభజించాలని చూసే అరాచక శక్తులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని రాజకీయ పార్టీలకు సూచించారు.

వేర్పాటువాదులతో సంబంధాలు తెంచుకోవడానికి ఇప్పటివరకు వివిధ రాజకీయ పార్టీలు ఎందుకు ఆలస్యం చేశాయో తనకు తెలియదని హార్పర్ అన్నారు. తన పదవీకాలంలో ఇటువంటి విషయాలకు దూరంగా ఉన్నామని.. ప్రస్తుత రాజకీయ పార్టీలు కూడా అదే విధానాన్ని పాటిస్తాయని తాను భావిస్తున్నానని తెలిపారు. ఎన్నోఏళ్లుగా కెనడాకు మిత్ర దేశంగా ఉన్న భారత్‌తో తిరిగి బలమైన సంబంధాలు ఏర్పరుచుకోవాలంటే ఇప్పటివరకు కెనడాకు, భారత్‌కు ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని, జిహాదీలు, యాంటీసెమిట్‌లు, ఖలిస్థానీలు వంటి విభజన సమూహాలను ప్రోత్సహించడం ఆపాలన్నారు. ఇవి మాత్రమే ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలకు పరిష్కారమని పేర్కొన్నారు.

కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు హార్పర్ 2006 నుంచి 2015 వరకు కెనడా ప్రధానమంత్రిగా ఉన్నారు. 1985 జూన్ 23న ఖలిస్థానీ ఉగ్రవాదులు ఎయిర్ ఇండియా విమానం కనిష్కపై బాంబు దాడి చేసిన ఘటనపై ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. రిటైర్డ్ జస్టిస్ జాన్ మేజర్ నేతృత్వంలోని ఆ కమిషన్ జులై 16, 2010న తన నివేదికను సమర్పించింది. ఈ దాడికి దారితీసిన వైఫల్యాలకు తమ ప్రభుత్వం తరఫున అప్పట్లోనే భారత్‌కు క్షమాపణలు తెలిపారు.

దశాబ్దాలతరబడి మిత్ర దేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య గత కొంతకాలంగా సంబంధాలు దెబ్బతిన్నాయి. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆయన ఆరోపించడంతో.. భారత్, కెనడాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగాయి. అనంతరం కెనడా ఎన్నికల్లో జోక్యం చేసుకోవడానికి భారత్ యత్నిస్తోందంటూ కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీసు డిప్యూటీ డైరెక్టర్ సంచలన ప్రకటన చేశారు.

# మార్చి నాటికి రూ.500 నోట్లు చెలామణిలో ఉండవా? నిజమెంత?

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 03)

ప్రస్తుతం చెలామణిలో ఉన్న రూ.500 నోట్లు వచ్చే ఏడాది మార్చి నాటికి దశల వారీగా ఆగిపోతాయంటూ జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ఓ ఛానల్‌కు సంబంధించిన యూట్యూబ్ వీడియోలో ఆర్‌బీఐ రూ.500 నోట్ల చెలామణిని 2026 మార్చి నాటికి నిలిపివేస్తారన్న అసత్య ప్రచారం జరుగుతోందని తెలిపింది. ఈ నకిలీ ప్రచారం పట్ల ప్రజల్ని అప్రమత్తం చేస్తూ పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. "ఆర్‌బీఐ అలాంటి ప్రకటన ఏదీ చేయలేదు. రూ.500 నోట్లు నిలుపుదల కావు, అవి చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి" అని స్పష్టం చేసింది. ఇలాంటి అసత్య వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. ఏదైనా వార్తను నమ్మడం, వేరొకరికి షేర్ చేసే ముందు అధికారిక వర్గాల నుంచి ధ్రువీకరించుకోవాలని ప్రజలకు సూచించింది.



# పంట సాగు హక్కు పత్రాల పై అవగాహన

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 3)

మార్కాపురం తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాల పంపిణీ పై అవగాహన సదస్సు గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ పంట సాగు హక్కు పత్రం పొందిన రైతుకు సాదారణ రైతులకు వర్తించే అన్ని పథకాలు వర్తిస్తాయని వివరించారు. కౌలు రైతులు పంట సాగు కొరకు కౌలు కార్డ్ పై ప్రభుత్వం వారు బ్యాంక్స్‌లో లోన్సు కూడా అందజేస్తారని తెలియచేశారు. గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రతి కౌలు రైతుకు సిసిఆర్‌సి కార్డ్ అందజేసి కౌలు రైతుకు ప్రభుత్వ పథకాలన్నీ అందిపచేయాలని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని కౌలు రైతులు అందరూ పంట సాగు హక్కు పత్రం –2019 చట్టం ప్రకారం రైతులు ఖచ్చితంగా పంట సాగు హక్కు పత్రం తీసుకోవాలని, తద్వారా కౌలు రైతులకు పంటలు నష్టపోయిన నష్టపరిహారం, పంటలభీమా ,పంట కోయగా వచ్చిన పంట దిగుబడిని మద్దతు ధర కు కౌలు అమ్ముకోవచ్చుని మరియసబ్సిడీపై విత్తనాలు కూడా పొందవచ్చునని తెలియజేశారు. కౌలు కార్డ్ తో భూ యజమానుల హక్కులకు ఎటువంటి నష్టం వాటిల్లదని భూ యజమానులకు తెలియజేసి గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతుల అందరికి తెలియచేయాలన్నారు. కౌలు కార్డ్ కేవలం 11 నెలలు కాలపరిమితితో సిసిఆర్‌సి కార్డ్ అందజేస్తారని రైతులకు తెలియపరచాలని కోరారు. అలాగే ప్రభుత్వం రైతుల సాగు కోసం అందించే అన్నదాత సుఖీభవ పథకం కూడా భూమిలేని కౌలు రైతుల కుటుంబంకి వర్తిస్తుందని తెలియచేశారు. మండలంకి 1700 కౌలు కార్డ్ టార్గెట్ ఇచ్చి ఉన్నారు. కావున కౌలు చేస్తున్న ప్రతి రైతును గుర్తించి వారికి పంట సాగు హక్కు పత్రం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, గ్రామ ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.



# సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శిగా శ్రీరామ శ్రీనివాసరావు ఎన్నిక

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)

సిపిఐ ఒంగోలు నగర మహాసభ ఒంగోలు నగరంలోని మల్లయ్య లింగం భవన్‌లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ గుజ్జుల ఈశ్వరయ్య జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎమ్మెల్యే నారాయణ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు హాజరైనారు. మహాసభలో నగర సమితి సభ్యులుగా 33 మందితో టి నగర సమితిని, ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆహ్వానితులుగా 9 మందిని గౌరవ ఆహ్వానితులుగా 7 మందిని ఎన్నుకోవడం జరిగింది. సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి గా శ్రీరామ శ్రీనివాసరావు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంజరిగింది. మహాసభ క్రింది తీర్మానాలను ఆమోదించింది.



**ఆమోదించిన తీర్మానాలు ఇవే....**

ఒంగోలు నగరానికి రోజువారి మంచినీటి సరఫరా చేయాలి. గత ప్రభుత్వం ఇచ్చిన ఒక సెంటు ఇళ్ల స్థలాలను రెండు సెంట్లు గా మార్చి ఇవ్వడంతో పాటు ప్రభుత్వమే గృహ నిర్మాణాలు చేయాలి. రిమ్స్ హాస్పటల్లో డాక్టర్ల కొర తను. మందుల కొరతలను ఇతర స్టాఫ్ ను నియమించి వైద్య నిర్ధారణ పరికరాన్ని కొనుగోలు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి. టిట్కో ఇండ్ల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ప్రభుత్వమే చెల్లించి లబ్ధిదారులకు ఇల్లు స్వాధీనం చేయాలి. నగరంలో విద్యారంగాన్ని సంస్కరించి ప్రైవేటు విద్యాసంస్థలలో కూడా పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి. ప్రభుత్వ రంగంలో ఉన్నటువంటి విద్యాసంస్థలను నడపడానికి నిధులతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి విద్యను ప్రజలకు అందుబాటులో తీసుకురావాలి. కాలేజీలలో అధిక ఫీజులు నేర్పించాలి మరియు క్వాలిటీ ఉపాధ్యాయులను నియమించి వారికి అన్ని ప్రభుత్వ నియమాలు వర్తించేలా తగు చర్యలు తీసుకోవాలి. నగరంలో ఈపాటికి ప్రభుత్వ భూములు గుడిసెలు వేసుకొని నివాసాలు ఉంటున్న దత్తాత్రేయ కాలనీ సరళ దేవినగర్ కార్మిక నగర్ వాసులకు వెంటనే పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి. పేదరిక నిర్మూలన మిషన్ ను ఆధునికరించి నిధులు కేటాయించి పేదరిక నిర్మూలన వైపు కార్యచరణ చేపట్టాలి. మునిసిపాలిటీ కార్పొరేషన్ ప్రజాస్వామికంగా అన్ని వార్డులలో నిరంతరం గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల ఆమోదంతో లబ్ధిదారులను ఎంపిక చేయాలి. నిష్పక్షపాతంగా ఇల్లు స్థలాలు లబ్ధిదారులను ఎంపిక చేసి ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి. నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగంలో గిరిజనులకు ప్రాధాన్యత ఇచ్చి వర్కర్లుగా నియమించాలి. చదువుకున్న యువతి యువకులకు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి. కొద్దిపాటి వర్షానికి జలమయం అవుతున్న నగరాన్ని మురుగు కాలువలను ఆధునికరించే లా తగు చర్యలు తీసుకోవాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ. అండర్ గ్రౌండ్ విద్యుత్ ను ఏర్పాటు చేయాలి. శివారు ప్రాంతాల్లో విద్యుత్తు డ్రైనేజీ రోడ్లు ఇతర మౌలిక వసతులు తక్షణమే ఏర్పాటు చేయాలి. నగరంలో ఈ ఇళ్ల నిర్మాణానికి ఇసుక సులభతరం గా సరఫరా చేయాలి. డొమెస్టిక్ వర్కర్లని లేబర్ డిపార్ట్మెంట్ గుర్తించి వారికి ఐడి కార్డులు ఇచ్చి ప్రభుత్వ కార్మికులుగా గుర్తించే అన్ని నియమా లను డొమెస్టిక్ వర్కర్లకు వర్తింపజేయాలి. యానాదులకు ఐటిడిఏ ప్రాజెక్టు బ్రాంచ్ ని ఒంగోలులో ఏర్పాటు చేయాలి. మార్కెట్లోకి ప్లాస్టిక్ వస్తువులు వచ్చిన తరుణంలో చేతివృత్తిదారుల జీవనపాదం దెబ్బతిన్నది వారందరికీ ప్రభుత్వ ప్రోత్సహకాలు అందించి ఉపాధి కల్పించాలి. నగరంలో రియల్ ఎస్టేట్ విస్తరించుచున్నది ప్రభుత్వ నియమాల ప్రకారం భవిష్యత్తు అవసరాల కోసం 10% ప్రజా అవసరాల కోసం కేటాయించవలసి ఉన్నది అందుకు కార్పొరేషన్ వారు 10% ప్రజా అవసరాల కోసం భూమిని రిజర్వ్ చేసి ఉంచవలసి ఉన్నది. నగర విస్తరించి ఉన్నది అందుకు తగ్గ స్మశాన వాటిక ఏర్పాటుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఈ మహాసభ పై తీర్మానాలని ఆమోదించినట్లు తెలిపారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 03.06.25 బుధవారం

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## మార్కాపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డిస్మిస్

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జూన్ 3)

మార్కాపురం అటవీశాఖ ఎఫ్ఆర్ఓగా పనిచేస్తున్న వరప్రసాద్ పై వచ్చిన లైంగిక వేధింపుల కేసులో నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట న్యాయస్థానం శిక్ష విధించింది. (తరువాయి 4లో...)

# యోగా పరిపూర్ణ జీవితానికి భద్రత

### యోగా పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జూన్ 3)

భారతీయ సంస్కృతి లో భాగమైన యోగ పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మందితో యోగ కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర క్యాంపెయిన్‌ను నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ పేర్కొన్నారు. మంగళవారం త్రిపురాంతకం మండల కేంద్రంలోని శ్రీ శ్రీమత్ బాల త్రిపురసుందరీ దేవి అమ్మ వారి దేవస్థానం ఆవరణ నందు యోగాంధ్ర- 2025లో భాగంగా నిర్వహించిన యోగా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీ ఆర్ గోపాల క్రిష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, వై పాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, దేవస్థానం చైర్మన్ ఐవి సుబ్బారావులతో పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి లో భాగమైన యోగ పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈనెల 21 న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మందితో యోగ కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర క్యాంపెయిన్ ను నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న వైజాగ్ లో జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవం రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొను యోగ కార్యక్రమానికి 5 లక్షల మంది ప్రజలు పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్ లో భాగంగా జిల్లాలోని గుండ్లకమ్మ, త్రిపురాంతకం, పాకల, కొత్త పట్నం బీచ్ తదితర 4 పర్యాటక ప్రదేశాలను యోగాంధ్ర కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. చారిత్రాత్మకమైన శ్రీ శ్రీమత్ బాల త్రిపురసుందరీ దేవి అమ్మ వారి దేవస్థానం ఆవరణలో సుమారు రెండు వేల మందితో యోగా అభ్యాసాన్ని చేయడం జరుగుతుందన్నారు. భారత ప్రభుత్వ ప్రతిపాదనతో 2014 సంవత్సరంలో 170 దేశాల ఆమోదంతో ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించడం జరిగిందన్నారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. యోగ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలన్నారు. భారత సంస్కృతి లో అంతర్భాగం అయిన యోగ ను ప్రతి రోజూ సాధన చేసినట్లయితే దైనందిన జీవితంలో చురుకుగా ఉండటంతో పాటు ఆరోగ్య కరమైన జీవితం సాగించేందుకు వీలుంటుందన్నారు. అందరూ యోగాని తమ జీవితంలో భాగం చేసుకుంటూ ప్రతిరోజు ప్రతి



ఒక్కరూ యోగాసనాలు వేయాలని, దాని ద్వారా ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా అనేక రుగ్మతలను దూరం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రజలు తమ జీవన విధానంలో యోగాను భాగంగా చేసుకుని ఆరోగ్యమైన జీవనం సాగించాలన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 9.66 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. 100 మందికి మాస్టర్ ట్రైనర్స్ గా

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 3)



కొత్తగొల్లపాలెం, చిన్నగంజాం మండలం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ ఒకటవ తేదీన నిర్వహించిన పి4 కార్యక్రమంలో భాగంగా ఎంపిక కాబడిన చిన్నగంజాం మండలంలోని కొత్తగొల్లపాలెం గ్రామం నకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులకు ఆదేశించారు. ఆ గ్రామంలో ప్రజలు కోరిన సదుపాయాల గురించి వాటి పురోగతిపై ఆయన అధికారులను ఆరా తీశారు. గృహ నిర్మాణాల కొరకు 42 మంది, ఇళ్ల స్థలాల కొరకు 13 మంది దరఖాస్తు చేసుకున్నారని వారికి పొజిషన్,కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయడమైనదని చిన్నగంజాం తహసిల్దార్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడమైనదని గృహ నిర్మాణ సంస్థ అధికారి జిల్లా కలెక్టర్ కు వివరించారు. గ్రామంలో 17 మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు అందాయని వాటిలో 2 పూర్తి చేయడమైనదని, మిగిలిన పనులు జరుగుచున్నాయని,304 ట్యాప్ కనెక్షన్లను జలజీవన్ మిషన్ పథకం ద్వారా పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవడమైనదని, గ్రామంలో 131 సోక్ పిట్స్ మంజూరైనాయని,ఆ పనులన్నీ జరుగుతున్నాయని ఆర్ డబ్ల్యు ఎస్.ఈ కలెక్టర్ కు వివరించారు. గ్రామంలో 4.48 కిలోమీటర్ల అంతర్గత సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు కొరకు నిధులు మంజూరైనాయని, ఈ పనులను త్వరలో ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఎస్.ఈ జిల్లా కలెక్టర్ కు వివరించారు. పర్చూరు నియోజకవర్గంలో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలకి 25 కోట్లు ఖర్చు అవుతుందని వీటికి సంబంధించి ప్రతిపాదనలు సమర్పించడమైనదని ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ కలెక్టర్ కు వివరించారు. 5 కుటుంబాలు రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్నారని వాటికి సంబంధించి మంజూరుకు చర్యలు తీసుకోవడమైనదని పౌర సరఫల అధికారి కలెక్టర్ కు వివరించారు. బాపట్ల పురపాలక సంఘ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవన పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి అవుతాయని సర్వ శిక్ష అభియాన్ అధికారి కలెక్టర్ కు వివరించారు. కొత్త గొల్లపాలెం అభివృద్ధి పనులను అధికారులందరూ చిత్తశుద్ధితో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి

## వెన్నుపోటు వైసీపీకి, జగన్ రెడ్డికి మాత్రమే పేటెంట్

### ఓట్లు వేసిన పాపానికి ఐదేళ్లు నరకం చూపారు

### ఇప్పుడు ప్రజలిచ్చిన తీర్పును అపహాస్యం చేస్తున్నారు

### మీ చిల్లర రాజకీయలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు

### ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)

రాష్ట్రంలో వెన్నుపోటు అనే పదానికి అసలైన పేటెంట్ జగన్ రెడ్డి, వైసీపీ పార్టీ మాత్రమేనని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ వెన్నుపోటు దినం నిర్వహిస్తుండటంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాకు తెలియజేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు నెరవేర్చిందన్నారు. కానీ అసలు హామీలేవి నెరవేర్చలేదంటూ ప్రజల మనసులో అబద్ధాన్ని నాటే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రజలకిచ్చిన ఎన్నో హామీలను తుంగలోకి తొక్కారన్నారు. వాస్తవంగా జగన్ రెడ్డి రక్తంలోనే వెన్నుపోటు ఉందని.. ఆయన తాత కాలం నుంచే ఇలాంటివి ఆకుటుంబానికి అలవాటన్నారు. కాంగ్రెస్ ని అడ్డంపెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీని స్థాపించాడన్నారు. బాబాయ్ కి గొడ్డలిపోటు, ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి ఇలా కుటుంబానికే వెన్నుపోట్లు పొడిచారన్నారు. మద్యపాన నిషేధం, మెగా డీఎస్సీ, అన్నక్యాంటీన్లు, బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు, అమరావతి విషయంలో ఇలా అన్నింటా వెన్నుపోట్లు పొడిచింది మీరు కాదా అంటూ నిలదీశారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, పింఛన్ల పెంపు, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, గుంతల రోడ్లు పూడ్చివేత ఇలా చెబుతూ పోతే 70శాతం హామీల్ని నెరవేర్చామన్ని ఈ సందర్భంగా మీడియాకు తెలియజేసారు.

## ఇంధన మంత్రి గొట్టిపాటితో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ ప్రతినిధుల భేటీ

- పునరుత్పాదక విద్యుత్ రంగంలో నైపుణ్యాభివృద్ధిపై చర్చ - ఉమ్మడి కార్యచరణతో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు హామీ

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 3)



ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సిలైజకి, డిప్యూటీ జనరల్ డేవిడ్ ఈగిల్సన్ లు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గుంటూరు జిల్లా తాడేపల్లి లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన భేటీలో పలు అంశాలపై చర్చించారు. సోలార్ తో పాటు పునరుత్పాదక విద్యుత్ రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి ఉన్న అవకాశాలపై ఈ భేటీలో చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి చాలా ప్రాధాన్యం ఇస్తుంది మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆస్ట్రేలియన్ కాన్యూలేట్ ప్రతినిధులకు వివరించారు. దీనితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీలో ఉన్న అపార అవకాశాలను పైన చర్చించారు. మంత్రి గొట్టిపాటితో భేటీపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ సిలైజకి.. పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఉన్న అవకాశాలను ఆస్ట్రేలియన్ ప్రతినిధులు మంత్రి గొట్టిపాటికి వివరించారు. అదే విధంగా మహిళలకు, గిరిజన ప్రాంత యువతకు ఉమ్మడి కార్యచరణతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తాము పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి గొట్టిపాటికి కాన్సులేట్ జనరల్ తెలిపారు. వీటితో పాటు గిరిజన ప్రాంత విశ్వ విద్యాలయాలకు ఆర్థిక సహాయం చేస్తామని పేర్కొన్నారు.

# యోగా పరిపూర్ణ జీవితానికి భద్రత




యోగ పై శిక్షణ ఇవ్వడం జరిగిందని, వీరు 6415 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, వీరు గ్రామ స్థాయిలో ప్రజలకు యోగ పై శిక్షణ అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మండల కేంద్రంలో మరియు ప్రతి పట్టణ కేంద్రాల్లో యోగ రోడ్డు ను నిర్ధారించి ప్రతి రోజూ యోగ సాధన చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన యోగ ప్రోటోకాల్ ప్రకారం యోగాంధ్ర క్యాంపెయిన్ జరుగుతున్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. వైపాలెం నియోజకవర్గ ఇంచార్జి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. యోగ సాధన అనేది మనస్సును లగ్నం చేయడంతో పాటు ఏకాగ్రత పెంపొందడంతో పాటు మనిషి జీవన విధానంలో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఇంతమంచి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని యోగా ను జీవన విధానంలో భాగం చేసుకోవాలన్నారు. అనంతరం పతంజలి యోగ గురువు బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, వైపాలెం నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, దేవస్థానం చైర్మన్ ఐవి సుబ్బారావు, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, పశు సంవర్థక శాఖ డిడి రవి కుమార్, సెట్నల్ సీఈఓ శ్రీమన్నారాయణ, ఆలయ ఈఓ రజనీ కుమారి, పర్యవేక్షకులు రంగరాజు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజలు, విద్యార్థినీ, విద్యార్థులు సుమారు రెండు వేల మంది యోగాసనాలు వేశారు. ఈ యోగ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.




## మార్కాపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డిస్మిస్

ఈ నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు ఆయనను సర్వీస్ నుంచి డిస్మిస్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. అటవీ శాఖ మార్కాపురం ఎఫ్ఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న వర ప్రసాద్ గతంలో సూళ్లూరుపేటలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మహిళా ఉద్యోగిని పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న అభియోగాల పై ఈ ఏడాది ఏప్రిల్ లో న్యాయస్థానం ఆయనకు శిక్ష విధించింది. ఈ నేపథ్యంలో వరప్రసాద్ పై నేరం రుజువై శిక్ష ఖరారు కావడంతో ఆయన్ను ప్రభుత్వం విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము పేరుతో మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



శ్రీనివాసరావు, గృహ నిర్మాణ సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్.ఈ అనంతరాజు, పిడి డ్వామా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఏపీ సీపీడీసీఎల్ ఈఈ మల్లిఖార్జున రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దెబోరా, చిన్నగంజాం తహసిల్దార్ ప్రభాకర్, వీక్షణ సమావేశం ద్వారా సర్వ శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 3)

మండల వైయస్సార్సీపి కార్యాలయంలో మంగళవారం 4న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమ పోస్టర్‌ను మండల వైసీపీ అధ్యక్షులు నన్నం పోతురాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ 2025 బ్రోచర్ ఆవిష్కరణ

### విద్యార్థులకు వెబ్ కౌన్సెలింగ్ పై అవగాహన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)

ఈ నెల 12వ తేదీన స్థానిక ఏ 1 ఫంక్షన్ హాలులో జరుగనున్న జాతీయ స్థాయి బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ 2025 కి సంబంధించిన బ్రోచర్ ని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ అధినేత డాక్టర్ షేక్ న్యామత్ మాట్లాడుతూ గత 21 సంవత్సరాలుగా బ్రిలియంట్ సంస్థ జిల్లా లోని విద్యార్థుల శ్రేయస్సు కోసం ప్రతి సంవత్సరం ఉచితంగా మెగా ఫెయిర్ నిర్వహిస్తున్నామని దీని వలన ఎంతో మంది విద్యార్థులు ఎన్నో విధాలుగా లబ్ది పొందుతూ తమ ఉజ్వల



భవిష్యత్ కి బాటలు వేసికొంటున్నారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ కాలేజీల్లో చేరబోయే విద్యార్థులకు వెబ్ కౌన్సిలింగ్ పై అవగాహన కల్పించడం తో పాటు, స్పెషల్ కోర్సులు తో పాటు, కెరీర్ గైడేన్స్ కూడా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మెగా ఫెయిర్‌లో జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా, మాజీ డీజీపీ కెఆర్ఎం కిషోర్ కుమార్, యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లు, పేరొందిన యూనివర్సిటీ లు, ఇంజనీరింగ్ కళాశాలలో పని చేస్తున్న ప్రిన్సిపాల్స్, డైరెక్టర్స్, ప్రొఫెసర్స్, మరికొందరు ప్రముఖులు, బ్యాంకర్స్ పాల్గొని తమ అమూల్యమైన సందేశాలు అందిస్తారన్నారు. ఎప్పటిలాగే పేరెన్నికగన్న యూనివర్సిటీలు, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల వారు, నేషనలైజడ్ బ్యాంక్స్ తమ స్టాల్స్ ని ఏర్పాటు చేసి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లు, ఎడ్యుకేషన్ లోన్స్ చేసికోవచ్చన్నారు. ఈ ఫెయిర్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ ఉంటుందని, విచ్చేసిన విద్యార్థులకు భోజన వసతి ఏర్పాట్లు కూడా చేస్తున్నామని తెలియచేశారు. ఈ సదవకాశం ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ సంస్థ ఎండి డాక్టర్ తోహారా, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. లక్కీ డిప్ ద్వారా లాప్ టాప్‌లను అందిస్తామని, ఎంట్రీ పాస్‌ల కోసం, ఫ్రీ బస్ పాస్‌ల కోసం బ్రిలియంట్ కంప్యూటర్స్ ఒంగోలు వారి 80194 79999 నెంబర్ కి కాల్ చేసి పొందవచ్చని తెలిపారు.

## విలువలతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదే



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 3)

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు మాచర్ల పట్టణంలోని శ్రీ సత్యసాయి విద్యా విహార్ నందు మంగళవారం జరిగాయి. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు సుజాత, గీత ఉపాధ్యాయులకు సలహాలు సూచనలను అందజేశారు. నేటితరం విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. ఆధ్యాత్మికత, మానవతా విలువలు లేని విద్య ఎడారిలో ఒయాసిస్ వంటిదని సత్య సాయి బాబా వారు అన్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత గురువులపై ఉందన్నారు. కార్యక్రమంలో సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ అక్కినేని అనిల్, సత్య సాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపల్ వై రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ మధురవాణి, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## హరిత శోభిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)

హరిత శోభిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. సంబంధిత శాఖలు సమన్వయంతో వివిధ వర్గాలను ఇందులో భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఈ నెల 5 వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని "వనం "మనం" కార్యక్రమం లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక కోటి మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేసించిన నేపథ్యంలో జిల్లాలో ఈ కార్యక్రమం అమలుపై మంగళవారం ప్రకాశం భవనం లో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డిఎఫ్ఓ (సోషల్ ఫారెస్ట్) రాజశేఖర్ మాట్లాడుతూ 5 వ తేదీన ప్రకాశం జిల్లాలో 4 లక్షల 10 వేల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టిందన్నారు. జూన్ నుంచి నవంబర్ వరకు 6 నెలల వ్యవధిలో జిల్లాలో 35 లక్షల 76 వేలకు పైగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 36 శాతం అటవీ విస్తీర్ణం వున్నదని, దీనిని 50 శాతానికి పెంచేలా ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్దేసించిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ "ఎండింగ్ ప్లాస్టిక్ సొల్యూషన్ గ్లోబల్లి" అనే ఇతివృత్తంతో ఈ నెల 5 వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. దీని పై కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాకుండా "వనం – "మనం" కార్యక్రమ వాస్తవ స్ఫూర్తితో వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాల్సి వుంటుందన్నారు. పాఠశాలలు, కాలేజీలు, విద్యా సంస్థలలో విస్తృత స్థాయిలో వీటిని నాటేలా చూడాలన్నారు. సంబంధిత శాఖలకు నిర్దేసించిన లక్ష్యం మేరకు నాటేలా మొక్కలను సరఫరా చేయాలని హార్టీకల్చర్, అటవీ శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు, ఉద్యాన అధికారి గోపి చంద్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాఘవరెడ్డి, డ్వామా ఏపిడి వందర్ మాన్, హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల సంస్థ జిఎం శ్రీనివాసరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, బిసి సంక్షేమ అధికారి అంజల, డిపిఓ గొట్టిపాటి వెంకట నాయుడు, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ మదన్, జిల్లా ఉప విద్యాధికారి చంద్ర మౌళి, జిల్లా పరిషత్, ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# క్రికెట్ ఆడి ఉత్తేజాన్ని నింపిన జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

**ఎస్పీ కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేత జిల్లా హెడ్ క్వార్టర్ జట్టు**
**క్రీడలతో మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం**






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)**
జిల్లా పోలీస్ శాఖలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఫైనల్ మ్యాచ్ లో జిల్లా హెడ్ క్వార్టర్స్ టీమ్ విజయం సాధించింది. నిరంతరం విధుల్లో ఉండే పోలీసు అధికారులు, సిబ్బందికి ఒత్తిడి నుండి ఉపశమనంతో పాటు దేహధారుడ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ తెలిపారు. జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ జరిగిన ఫైనల్ మ్యాచ్ లో జిల్లా సబ్ డివిజన్ జట్టు, జిల్లా హెడ్ క్వార్టర్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు జిల్లా ఎస్పీ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రీడాస్ఫూర్తితో ఆడాలని గెలుపోటములు ముఖ్యం కాదన్నారు. నిత్యం శాంతిభద్రతల పరిరక్షణ, వివిధ రకాల కేసులు దర్యాప్తు, బందోబస్తు మొదలైన విధులతో సతమతమవుతున్న సిబ్బందిలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఈ క్రికెట్ మ్యాచ్ లు నిర్వహించడం జరిగిందన్నారు. క్రికెట్ మ్యాచ్ ల్లో పోలీస్ సిబ్బంది చూపిన ఉత్సాహం, పోరాట స్ఫూర్తిని అభినందించారు. విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంలోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. అంతే కాకుండా క్రీడల ద్వారా లీడర్ షిప్, టీమ్ వర్క్ లాంటి లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. హొదాలు మరచి అందరూ సమానమనే భావన మరియు స్నేహ స్వభావం, సమిష్టితత్వంలు పెంపొందడానికి క్రీడలు దోహదం చేస్తాయి. కావున ప్రతి ఒక్కరు ఏదో ఒక్క క్రీడను ఎంచుకొని ఆడటం వలన మానసిక ఒత్తిడిని అధికమించి, ఆరోగ్యంగా ఉంటారని తెలియచేశారు. తదుపరి జిల్లా సబ్ డివిజన్ పోలీస్ అధికారుల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లను కోల్పోయి 94 పరుగులు చేసింది. అనంతరం 95 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జిల్లా హెడ్ క్వార్టర్ జట్టు 9 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జిల్లా సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది జట్టు నిర్ణీత 9.5 ఓవర్లలో అల్ అవుట్ అయి 53 పరుగులు చేసింది. అనంతరం 54 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జిల్లా హెడ్ క్వార్టర్ జట్టు 6.5 ఓవర్లలోనే కేవలం నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ టోర్నమెంట్‌లో ఎఆర్ ఎస్పీ అశోక్ బాబు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె నాగేశ్వరరావు, డిఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, నాగరాజు, శ్రీనివాసరావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



















# దళిత ఎస్ఐ పై వైసీపీ, బ్లూ మీడియా తప్పుడు ప్రచారం హేయం

## మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 3)**
మద్రిపూడి దళిత ఎస్ఐ పై వైసీపీ తప్పుడు ప్రచారం దుర్మార్గమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం ఆయన వెలగపూడి సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా మద్రిపూడి ఎస్ఐ విచారణ కోసం కొండపి మండలం జాళ్లపాలెంలో వైసీపీ రౌడీషీటర్ ఇంటికి వెళ్ళారు. ఆ రౌడీ షీటర్ కుటుంబ సభ్యులే ఎస్ఐ విధులకు అడ్డుపడి ఎస్ఐ తమపై దాడి చేసినట్టు తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. వాస్తవాలని వక్రీకరించి వైసీపీ నేతలు, బ్లూ మీడియా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. గత 5 ఏళ్ల వైసీపీ పాలన అంతా జగన్ పోలీసులను ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులకు వాడుకున్నారన్నారు. నేడు కూటమి పాలనలో పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేస్తూ శాంతి భద్రతలు కాపాడుతున్నారని తెలిపారు. నిజాయితీయిగా పనిచేస్తున్న పోలీసుల పై వైసీపీ తప్పుడు ప్రచారం హేయమైన చర్య అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# దుర్గా మల్లేశ్వరస్వామి సేవలో ఎంపిటిసి సభ్యులు ఆకుపాటి వెంకటేష్

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 3)**
విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వరి స్వామి సేవలో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు శేష వస్త్రం అందజేసి వేద అశ్వర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గద్దె సుధాకర్, బండ్ల నారాయణ, గాడి మహేంద్ర, ఇండ్ల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.





# అశోక్‌బాబుకు ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అభినందనలు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు ప్రకాశం జిల్లా పోలీసుశాఖలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ గా విధులు నిర్వహిస్తున్న అశోక్ బాబు ఎఆర్ నాన్ క్యాడర్ ఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏ ఆర్ దామోదర్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి, హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎస్పీ ఎఆర్ నాన్ క్యాడర్ ఎస్పీ అశోక్ బాబు షోల్డర్ ప్యాడ్‌కు స్టార్ చిహ్నాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదోన్నతి పొందడం చాలా గొప్ప విషయమని, పోలీస్ శాఖలో ఆయన చూపిన అంకితభావం, నిబద్ధత, అత్యుత్తమ సేవలకు ఈ పదోన్నతి ఒక సరైన గుర్తింపు అని తెలిపారు. ఈ పదోన్నతిని సద్వినియోగం చేసుకుంటూ, నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రముఖ పాత్ర వహిస్తూ, విధినిర్వహణలో మరింత అకింతభావంతో సేవలు అందిస్తూ పోలీస్ శాఖ యొక్క ప్రతిష్ట పెంపొందించాలని, భవిష్యత్తులో మరెన్నో మైలు రాళ్ల అధిగమించాలని మనస్పూర్తిగా ఆకాక్షించారు.

# వెన్నుపోటు దినం ర్యాలీని విజయవంతం చేయాలి

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 3)**
జూన్ 4వ తేది బుధవారం ఉదయం 9 గంటలకు కందుకూరులోని మెర్సీ స్కూల్(కోర్టు దగ్గర) నుంచి ర్యాలీగా సబ్ కలెక్టరు కార్యాలయం వరకు కందుకూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బుర్రా మధుసూధన్ యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన "వెన్నుపోటు దినం "నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వైసీపీ నాయకులు ఓ ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న వివిధ హొదాల్లో ఉన్న నాయకులు, వైఎస్ఆర్ పార్టీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్ కుటుంబ సభ్యులందరూ విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

# గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 3)**
ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులతో ముందుగా పుస్తక పఠనం చేపించి అనంతరం పిల్లల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసే ప్రయత్నంలో వారికి చిత్ర లేఖనం పోటీలు నిర్వహించడం జరిగింది. అనంతరం వ్యాపారవేత్త పువ్వాడి నాగేశ్వరరావు కుమార్తె పువ్వాడి రేణుక (సాఫ్ట్ వేర్ ఇంజినీర్) పుట్టిన రోజు సందర్భంగా పిల్లందరికీ స్నాక్స్ పంచిపెట్టి వారి ప్రేమకు పాత్రులైనారు. వారి కుటుంబానికి గ్రంథపాలకుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 33 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధే గీటురాయి

## వేల కోట్ల నిధులతో అభివృద్ధి పరుగులు -మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 3)**

కూటమి ప్రభుత్వం 365 రోజుల పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజా క్షేమం, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని మాచర్ల నియోజకవర్గం శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ 365 రోజుల పాలనలో నియోజకవర్గ పరిధిలో 360 డిగ్రీస్‌లో నభూతో నభవిష్యతి అన్నట్లు అభివృద్ధిని ప్రజలు చూశారని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాది పాలనలో వేల కోట్ల నిధులు కేటాయించి మాచర్ల నియోజకవర్గాన్ని ఆధునీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రూ. 178 కోట్లతో ప్రధాన రహదారులు ఆధునీకరణ

గత రాక్షస పాలనలో మాచర్ల నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధిని నోచుకోలేదని ఎమ్మెల్యే జూలకంటి విమర్శించారు. ఎక్కడ చూసినా ప్రధాన రహదారులు గుంటల మయంగా మారి, ప్రజా రవాణా దుర్భరంగా తయారైందని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెనువెంటనే దాదాపు రూ.175 కోట్ల నిధులతో నియోజకవర్గంలో ప్రాథమికంగా ప్రధాన, ప్రధాన రహదారులను కలిపే అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశామని ఆయన పేర్కొన్నారు. అంతేకాక గ్రామీణాభివృద్ధికి పెద్ద పేట వేస్తూ, రూ 16 కోట్లతో సీసీ రోడ్లను నిర్మించామని ఆయన వివరించారు.

### తాగునీటికే అగ్రతాంబూలం

జల జీవన మిషన్ ద్వారా నియోజకవర్గంలో మారుమూల తండాలకు సైతం శుద్ధ జలాలను అందించే లక్ష్యంతో రూ. 600 కోట్లు, మాచర్ల పట్టణ తాగునీటి అవసరాలకై అమృత స్కీం ద్వారా రూ.117 కోట్లు నిధులను కూటమి ప్రభుత్వం కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ జలాలను అందించే ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు.

### అత్యున్నత ప్రమాణాలతో విద్యకు మౌలిక సదుపాయాలు

నియోజకవర్గంలో విద్యాలయాల్లో మౌలిక వసతులు పెంపొందించి, నూతన భవనాల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను కేటాయించిందని ఎమ్మెల్యే జూలకంటి ఉద్ఘాటించారు. నియోజకవర్గ పరిధిలోని రూరల్ మండలం తాళ్లపల్లి నందు రూ. 25 కోట్ల తో నూతనంగా కేంద్రీయ విద్యాలయం నిర్మాణం, కారంపూడి, దుర్గి, వెల్దుర్తి మండటాల్లో కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల పాఠశాల, మోడల్ స్కూల్స్ నందు నూతనంగా అదనపు భవనాలు, వసతి గృహాలకు రూ. 8 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని ఆయన వివరించారు. ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఏపీ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ అహర్నిశలు పాతుపడుతున్నారని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

### వ్యవసాయం, పాడి పరిశ్రమకు సముచితస్థానం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఏడాదిలో నియోజకవర్గం లో వ్యవసాయం, పాడి పరిశ్రమకు సముచిత స్థానం కల్పించిందని ఎమ్మెల్యే జూలకంటి వెల్లడించారు. ఎన్‌ఎస్పీ కాలువ పూడిక తీత పనులకు రూ. 4 కోట్ల 50 లక్షలు, నియోజకవర్గ పరిధిలో దాదాపు రూ. 3 కోట్లతో 125 మినీ గోకులాలకు ఖర్చు చేయగా.. రూ. 18 లక్షలు విలువచేసే వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందజేసినట్లు ఆయన చెప్పారు. అలానే రైతుకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకుంటూ రైతును ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వ అనేక సంస్కరణలు తీసుకొస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### శిఖరాగ్రంలో సంక్షేమం

కూటమి ప్రభుత్వం ఈ ఏడాది పాలనలో మాచర్ల నియోజకవర్గంలో దాదాపు 41 వేల 749 మంది అర్హులకు రూ. 235 కోట్ల, 32 లక్షల, 82 వేలు పంపిణీ చేసి.., ఆదుకుందని ఎమ్మెల్యే జూలకంటి వివరించారు. అలానే సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 5 కోట్లను ఆపదలో ఉన్న వారికి వైద్య ఖర్చులు నిమిత్తం అందజేసినట్లు ఆయన వెల్లడించారు. అర్హులైన అన్నీ వర్గాలకు వారికి ఆర్థిక ఊతాన్ని ఇచ్చేందుకు వ్యక్తి గత రుణాలు, మహిళా సాధికారితకు కుట్టు మిషన్ల పంపిణీ వంటి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన వివరించారు.

### పర్యటకాభివృద్ధికి ఊతం

పర్యటకంగా వెనకబడ్డ నాగార్జున సాగర్ కు జవసత్వాలను తీసుకొచ్చేందుకు నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయల ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.25 కోట్లు మంజూరయ్యేలా ఆయన చొరవ చూపారన్నారు. బౌద్ధ వారసత్వం, సాంస్కృతిక చిహ్నాలను సుసంపన్నం చేస్తూ పర్యాటకంగా ఆదాయం పెంచడాన్ని కూటమి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోందని చెప్పారు. వెనకబడ్డ ఎగువ పల్నాడు పర్యాటకంగా ప్రగతిని సాధిస్తే, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్ద ఎత్తున నిధులను తీసుకొచ్చి మాచర్ల నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కట్టుబడి పని చేయడం నియోజకవర్గ ప్రజలు అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి హర్షం వ్యక్తం చేశారు.









---

# బీసీ బాలికలకు వసతి గృహం ఏర్పాటు చేయాలి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 3)**

ఫమార్కాపురం డివిజన్ కేంద్రంలో బీసీ బాలికలకు వసతి గృహాన్ని ఏర్పాటు చేయవలసిందిగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిఎల్‌పి యాదవ్ మార్కాపురం సబ్ కలెక్టర్‌ని కోరారు. సుమారు 150 మందికి పైగా విద్యార్థినులు ప్రతి విద్యా సంవత్సరంలోనూ హాస్టల్ లేని కారణంగా ఉన్నత పాఠశాల విద్యను అభ్యసించకుండానే తమ తమ గ్రామాలకు పరిమితమవుతున్నారు. బాలిక విద్య యొక్క ఆవశ్యకతను గుర్తించి మార్కాపురంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేయమని అనేక సంవత్సరాలుగా బీసీ సంక్షేమ సంఘం తరఫున విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నామని రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేటు భవనంలో అయినా వసతి గృహాన్ని ప్రారంభించి పేద బీసీ బాలికలను విద్యావంతులను చేసేందుకు కృషి చేయవలసిందిగా సబ్ కలెక్టర్‌ని కోరారు. వసతి గృహాన్ని శాశ్వత ప్రాతిపదికన స్థల సేకరణ చేసి నూతన భవనాన్ని నిర్మించే ఏర్పాట్లను చూస్తామని కూడా సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ఈ సంవత్సరం ఎట్టి పరిస్థితుల్లో కూడా పుల్లలచెరువు త్రిపురాంతకం ప్రాంతాల నుంచి కూడా వస్తున్నటువంటి బాలికలకు హాస్టల్ వసతి ఏర్పాటు చేయడం ద్వారా డ్రాపవుట్లు లేకుండా అందరినీ విద్యావంతులుగా చేసి వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు సబ్ కలెక్టర్ తగు ప్రయత్నాలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి విద్యా సంవత్సరం మొదట్లో బీసీ సంఘం వారి అభ్యర్థన మేరకు అప్పటి సబ్ కలెక్టర్లు ఆర్డీవోలు వేరే వసతి గృహాల్లో బాలికలకు కొంత మేరకు అవకాశం కల్పిస్తున్నారని ఇది సరిపోని పరిస్థితుల్లో ఈ విద్యా సంవత్సరం తప్పనిసరిగా ప్రైవేటు భవనంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేయవలసిందిగా బీసీ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిఎల్‌పి యాదవ్ జాతీయ కార్యవర్గ సభ్యులు రంగస్వామి గౌడ్, అబ్రహం రాజకుమార్, శంకర్ గౌడ్, వెంకటేష్, నారాయణ, రాంబాబు, ముదిరాజ్ పాల్గొన్నారు.

# పోలీసు విధులకు ఆటంకం కల్గించిన వారిపై కేసు నమోదు

## జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)**

జరుగుమల్లి మండలం జాళ్ళపాలెం గ్రామంలో విధి నిర్వహణలో ఉన్న మర్రిపూడి ఎస్ఐ పై చెడు నడత కలిగిన మారంరెడ్డి కొండలరావు అండతో ఒక మహిళ దురుసుగా ప్రవర్తిస్తూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించగా, సంబంధిత వారిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా దేవాలయాల్లో దొంగతనాలపై విచారణలో భాగంగా మర్రిపూడి ఎస్ఐ రమేష్ బాబు నేతృత్వంలో పోలీస్ బృందం సీసీ కెమెరా ఫుటేజ్ సేకరించేందుకు మే 28న జాల్లపాలెం గ్రామానికి చేరుకుంది. అక్కడ మారంరెడ్డి కొండలరావు వద్ద ఉన్న షాపులో రోడ్డు వైపు కెమెరా ఉండటంతో, అక్కడ పనిచేస్తున్న బండి చంద్రమ్మ అనే మహిళను ఫుటేజ్ కోసం సంప్రదించారు. కానీ ఆమె సహకరించకుండా, తమ్ముడికి ఫోన్ చేసి, అతని సూచన మేరకు పోలీసులు అవసరపడే ఫుటేజ్‌ను తుడిచేయటం, డివిఆర్ దహనం చేస్తామని హెచ్చరించారన్నారు.

పోలీసులు లోపలికి వెళ్లి ఫుటేజ్ తనిఖీ చేయాలని యత్నించగా, చంద్రమ్మ ఎస్ఐను నెట్టడంతో పాటు, కొండలరావు వదిన కూతురు ఆదిలక్ష్మి అడ్డగించింది. ఈ ఘటనను మారంరెడ్డి కొండలరావు కావాలని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి పోలీసుల పరువు తీసే ప్రయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో డ్యూటీలో ఉన్న పోలీసులను అడ్డుకున్నందుకు, విచారణకు అవసరమైన ఆధారాలను హాని చేసే విధంగా ప్రవర్తించినందుకు కేసు నమోదు చేశామన్నారు. సీసీ కెమెరా ఫుటేజ్ దొంగతనాల ఛేదనకు కీలక ఆధారమని, అలాంటి సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా నిరోధించడం న్యాయానికి ఆటంకం కలిగించడమేనని ఎస్పీ తెలిపారు. ప్రత్యేకంగా ప్రజలు పోలీసులకు సహకరించడం పౌర బాధ్యత మాత్రమే కాక, చట్టబద్ధమైన బాధ్యత కూడా అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. మారంరెడ్డి కొండలరావు పై గతంలో ఎనిమిది కేసులు నమోదయ్యాయన్నారు. శిక్షలు కూడా అనుభవించారన్నారు. ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసిన మారంరెడ్డి కొండలరావు 2014లో విధుల్లో నిర్లక్ష్యం కారణంగా సస్పెన్షన్‌కి గురయ్యాడన్నారు. మీడియా సమావేశంలో కనిగిరి డిఎస్పీ ఈశ్వర్ యశ్వంత్ కుమార్, కొండపి సిఐ జి సోమశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

---

# మోసం, అవినీతి, వెన్నుపోట్లకు బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడి

**85 శాతం హామీలకు ఎగనామం పెట్టిన జగనే**

**అసలైన వెన్నుపోటుదారు**

**ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు**



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 3)**

రాష్ట్ర రాజకీయాల్లోనే మోసం, అవినీతి, వెన్నుపోట్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన ఘనుడు జగన్‌రెడ్డి అని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తి నైజాన్ని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రజలు జూన్ 4, 2024 ఎన్నికల ఫలితాల్లో జగన్ దారుణాలకు తగిన గుణపాఠం నేర్పారని, కూటమికి అఖండ మెజారిటీతో ఆశీస్సులు అందించారన్నారు. ఇప్పుడు మద్యం కుంభకోణం బట్టబయలై అరెస్టు భయంతో కొత్త డ్రామాలు మొదలు పెట్టిన అతడు "ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే" అన్నట్లు ప్రజలు, కూటమి ప్రభుత్వంపైకే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. జూన్-4ని వెన్నుపోటు దినంగా నిర్వహించాలని వైకాపా అధ్యక్షుడు జగన్ ఇచ్చిన పిలుపుపై మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తీవ్రంగా స్పందించారు చీఫ్‌విప్ జీవీ. ఒక్కఛాన్స్ అన్న మాటల్ని నమ్మి ప్రజలు అధికారం ఇస్తే 85% హామీలను ఎగనామం పెట్టిన అసలైన వెన్నుపోటుదారు జగన్ అన్నారు. తొలి ఏడాదిలో కనీసం 10% కూడా అమలు చేయలేదని, ఉన్న పథకాలను కూడా రద్దు చేసిన విషయం అప్పు డే మరిచి పోతే ఎలా అని ఎద్దేవా చేశారు. సొంత బాబాయి హత్యలో నిందితులను కాపాడడం, ఆస్తి కోసం తల్లి-చెల్లిని గెంటేయడం, వైఎస్సార్‌సీపీని శివకుమార్ నుంచి లాక్కోవడం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులను లక్షల కోట్లలో కొల్లగొట్టడం ఇవేనా జగన్ అర్హతలని చుర కలు వేశారు. మద్య నిషేధం అమలు గాలికి వదిలి, అన్న క్యాంటీన్లు రద్దు చేసి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఊసు పట్టని జగన్ అసలు ఏ మొహం పెట్టుకుని ఇంకా ప్రజల మధ్యకు వస్తు న్నాడో అర్థం కావడం లేదన్నారు. ఎవరిది మోసం? ఎవరిది సంక్షేమ శకం? అనేది అంచన వేసే మొన్నటి ఎన్నికల్లో ప్రజలు 151 నుంచి 11కు దించి మూల కూర్చోబెట్టినా బుద్ధి మార్చుకోక పోతే ఎలా అని తూర్పారా బట్టారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 70% హామీ లు నెరవేర్చి సంక్షేమ పాలనకు నాంది పలికిందన్నారు చీఫ్‌విప్ జీవీ. నెలకు రూ. 2720 కోట్లు, ఏడాదికి రూ. 34,000 కోట్లతో పింఛన్లు అందిస్తున్నామని, దేశంలోనే ఇదొక చరిత్రగా పేర్కొన్నా రు. దీపం-2 కోసం రూ.2684 కోట్లతో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామ ని అన్నారు. రూ.1200 కోట్లతో 20,000 కి.మీ రోడ్ల మరమ్మతులు , చెత్త పన్ను రద్దు చేశామని, రూ.1674 కోట్ల ధాన్యం బకాయిల చెల్లించామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మత్స్యకారులకు రూ. 20,000 చొప్పున భరోసా అందిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో 13,000పైగా పంచాయతీల్లో రూ. 4500 కోట్లతో 30,000 పనులు చేపట్టామని గుర్తుంచుకోవాలన్నారు . జగన్ రద్దు చేసిన 94 కేంద్ర పథకాల్లో 73 పునరుద్ధరించామని, బీసీలకు ఇటీవలి బడ్జెట్‌లో రూ. 47,456 కోట్లు కేటాయించామన్న జీవీ వీటిల్లో ఏది వెన్నుపోటు, ఎవరిది మోసమో ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు.

---

# ఘనంగా మలేరియా మాసోత్సవాలు



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 3)**

మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా ఈ నెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరిగే మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం కొండపి మండలం పెట్లూరు ప్రాథమిక హాస్పిటల్ పరిధిలోని 19 పంచాయతీలు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఎమ్మెల్ హెచ్‌పిల ఆధ్వర్యంలో మలేరియా అంతం మనతోనే అంటూ పెట్లూరూ హాస్పిటల్ నుండి గ్రామ సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జాగ్రత్తలుపాటిద్దాం మలేరియాని అంతంచేద్దాం. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం అంటూ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, డాక్టర్ ప్రియాంక, సూపర్వైజర్ లక్ష్మీనరసింహం, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



# క్విస్ కళాశాలలో ఘనంగా ప్లేస్ మెంట్ సక్సెస్ మీట్

## 928 మందికి క్యాంపస్ ఉద్యోగాలు

## ప్రత్యేక శిక్షణ, నైపుణ్యశిక్షణ వల్లే సాధ్యం- విద్యార్థులకు సన్మానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్ మెంట్ సక్సెస్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 928 మందికి ప్లేస్ మెంట్స్ వచ్చాయని, ఇది చాలా గర్వకారణం అని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్లేస్ మెంట్ సక్సెస్ మీట్ నిర్వహించి విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ప్లేస్ మెంట్స్ సాధించిన విద్యార్థులకు అత్యంత వైభవంగా కళాశాలలోకి స్వాగతం పలికారు. అనంతరం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి %ు=×చీజు +జజు% కార్పొరేట్ కంపెనీ ప్రతినిధి అరుణ్ కుమార్ శుభనవీస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంతమందికి ప్లేస్ మెంట్స్ రావడం రికార్డ్ అని కొనియాడారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ లో ఉద్యోగాలు రావడం అంత ఈజీ కాదని, క్విస్ విద్యార్థులకు మొదటి నుంచి ఇస్తున్న స్పెషల్ ట్రైనింగ్ వల్లే ఇది సాధ్యం అయిందని చెప్పారు. పెద్ద పెద్ద యూనివర్సిటీలు, కాలేజీలకి రానన్ని ప్లేస్ మెంట్స్ మీకు వచ్చాయంటే మీకు ఎంత ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారో అర్థం అవుతుందని చెప్పారు. భవిష్యత్తులో మీలాంటి క్విస్ కాలేజి విద్యార్థులకు మరిన్ని ఉద్యోగాలు వస్తాయని, ఇచ్చేందుక కచ్చితంగా చాలా కంపెనీలు ముందుకు వస్తాయని ఆయన చెప్పారు. అనంతరం మాట్లాడిన క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ నిడమానూరి శ్రీ గాయత్రి విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఇన్ని ప్లేస్ మెంట్స్ సాధించడం గర్వకారణం అని ఆమె అన్నారు. విద్యాసంస్థల అధినేత సూర్య కల్యాణ్ చక్రవర్తి గారి విజన్ తో ఎన్నో ప్రత్యేక కోర్సులు, ప్రత్యేక కరిక్యులమ్ ఏర్పాటు చేశారని, దాని ఫలితం ఈ రోజు కళ్ల ముందు కనిపిస్తుందని ఆమె అన్నారు. విద్యార్థులు, ఫ్యాకల్టీ, హెచ్ వోడీలు, ముఖ్యంగా ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ సెల్ వాళ్ల కృషి ఫలితంగా 928 ఉద్యోగాలు సాధించామని ముందు ముందు ఇంకా మరిన్ని ఉద్యోగాలు, అద్భుతమైన ప్యాకేజ్ తో రావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్లేస్ మెంట్ సెల్ డీన్ డాక్టర్ జగదీశ్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, క్విస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, హెచ్ వోడీలు, డీన్ లు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వాళ్లంతా ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేక జ్ఞాపికలు అందజేశారు.

**ఆయన విజన్, ఆలోచనలకు ప్రతిరూపం**

డాక్టర్ నిడమానూరి కల్యాణ్ చక్రవర్తి సంకల్పం, విజన్ తో కళాశాల ప్రారంభించారు. ప్రకాశం జిల్లా వాసులకు ఉత్తమ విద్య అందిచడం, వారంతా ఉన్నత స్థానాల్లో ఉండాలనే ధ్యేయంతో ఆయన విద్యాసంస్థలను ప్రారంభించారు. అలానే కొత్త కొత్త కోర్సులు, కొత్త కొత్త విధానాలను ప్రవేశపెట్టి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. దాంట్లో భాగంగానే ప్రతి ఒక్క విద్యార్థి ఉద్యోగం తెచ్చుకునేందుకు వీలుగా వారికి శిక్షణ అందించాలనే ఉద్దేశంతో క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన ప్రత్యేకమైన ట్రైనింగ్ ఇచ్చేలా కరిక్యులమ్ ని రూపొందించారు. ప్రైమ్ బ్యాచ్ లు నిర్వహిస్తూ ఉద్యోగాలు తెచ్చుకునేందుకు, ఉద్యోగం వచ్చిన తర్వాత ఉపయోగపడే విధంగా స్కిల్స్ విద్యార్థులకు అందేలా నైపుణ్య శిక్షణ అందేలా కోర్సులు రూపొందించారు. దాని ఫలితమే రికార్డు స్థాయి ప్లేస్ మెంట్లు.

**ట్రైనింగ్ అద్భుతంగా ఉంటుంది..**
**సీఎస్ఈ విద్యార్థిని సంజన**

క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ సెల్ వారు ఇచ్చే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. మేనేజ్ మెంట్, ఫ్యాకల్టీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి ఒక్క విషయాన్ని అర్థమయ్యేలా చెప్తారు. వారి సహకారం వల్లే ఉత్తమ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. కాలేజిలో ఉండే ల్యాబ్ లు, కోడింగ్ ఫ్యాకల్టీ , కార్పొరేట్ ఎక్స్ పర్ట్స్ ఇచ్చిన ట్రైనింగ్ చాలా ఉపయోగపడ్డాయి. కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా కాలేజి యాజమాన్యానికి, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్స్ సెల్ కి సీఎస్ఈ సంజన ధన్యవాదాలు తెలిపారు.

**ప్రైమ్ బ్యాచ్ బాగా ఉపయోగపడింది...**
**చివాకుల లక్ష్మీ మానస**



కాలేజిలో ఇచ్చిన ట్రైనింగ్ చాలా చాలా ఉపయోగపడింది. ఇక్కడ క్లాస్ లో చెప్తున్నప్పుడు ఎంటా ఇది అనుకునేదాన్ని కాని బయటికి వెళ్లాక అర్థం అయ్యింది ఎంతలా ఉపయోగపడుతుందో అని. ప్రైమ్ బ్యాచ్ లో భాగంగా ఇచ్చిన శిక్షణ వల్ల కమ్యూనికేషన్ స్కిల్స్ బాగా వచ్చాయి. దాంతో పాటు టెక్నికల్ నాలెడ్జ్ కూడా వచ్చింది. దీంతో ఇప్పుడు కంపెనీలో ఉద్యోగాలు ఈజీగా చేసుకోగలుగు తున్నాము. ప్రైమ్ బ్యాచ్ ఆలోచనతో మాకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన కాలేజి యాజమాన్యానికి ధన్యవాదాలు.

**కోడింగ్ వల్లే ఈజీ అయ్యింది...**
**బోయల మంజుల**



నేను ఉద్యోగంలో చేరిన తర్వాత అక్కడ నా బ్యాచ్ మొత్తానికి కోడింగ్ లో ట్రైనింగ్ ఇచ్చారు. క్విస్ కాలేజిలో కోడింగ్ నేర్పించారు. దానిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దాంతో ఇప్పుడు నాకు కోడింగ్ చాలా సులభం అయ్యింది. మిగతా వాళ్లు అక్కడ నేర్చుకుని చేస్తున్న దానిని నేను ఇక్కడే నేర్చుకున్నాను. అది నాకు చాలా లాభదాయకం అయ్యింది. కాలేజిలో నేర్పించిన సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ నాకు బాగా ఉపయోగపడుతున్నాయి. ఇప్పుడు జాబ్ రావడం చాలా చాలా హ్యాపీగా ఉంది.

# గెలుపోటములు ముఖ్యం కాదు..

# క్రీడా స్ఫూర్తితో ఆడాలి

**జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్**
**ఎస్పీ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ**
**పాల్గొంటున్న పోలీస్ సబ్ డివిజన్‌లు, ఆర్మడ్ రిజర్వ్ విభాగం**






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 3)

క్రీడాస్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలని, గెలుపోటములు ముఖ్యం కాదని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ తెలిపారు. శాంతి భద్రతలను కాపాడడంలో నిరంతరం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం, వారిలో ఉత్సాహాన్ని మరియు క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పెరేడ్ గ్రౌండ్ లో ఒంగోలు, దర్శి, మార్కాపురం, కనిగిరి, ఆర్మడ్ రిజర్వ్, స్వాట్ టీం, ఐటి కోర్ 7 జట్లకు నిర్వహిస్తున్న ఎస్పీ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించి క్రికెట్ మ్యాచ్‌లను ఆసక్తిగా తిలకించారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుడ్యం పెంపొందుతుందన్నారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది క్రీడలతో ఒత్తిడి నుండి బయటపడవచ్చున్నారు. క్రికెట్ అంటే అది కేవలం క్రీడ మాత్రమే కాదని గ్రహించాలని, జట్టును స్ఫూర్తిమంతంగా నాయకత్వ లక్షణాలతో నడిపించడానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, పోరాట పటిమ వంటి వాటిని పెంపొందించుకోవడానికి ఇది సహకరిస్తుందన్నారు. “పోలీసులు ప్రజల సేవలో ఎప్పుడూ ముందుంటనన్నారు. అదే సమయంలో తమ వ్యక్తిగత ఆరోగ్యంపైనా శ్రద్ధ పెట్టాలని, క్రికెట్ వంటి క్రీడలు మనిషిని శారీరకంగా, మానసికంగా దృఢంగా చేస్తాయన్నారు.

ఈ మ్యాచ్‌లలో ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన చేస్తూ, జట్టు సమన్వయం, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, చివరకు విజేతగా నిలిచిన జట్టుకు ఎస్పీ చేతుల మీదుగా ట్రోఫీలు, ఉత్తమ ఆటగాళ్లకు ప్రత్యేక గుర్తింపుతో మెమెంటోలు ఇవ్వబడ్డాయి. పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, డిఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, నాగరాజు, శ్రీనివాసరావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.







# యోగా పోటీలు ప్రారంభం





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 3)

మండలంలో యోగాంధ్ర మండల కాంపిటీషన్స్‌లో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా దరిమడుగు పిడి బాబురావు, యోగా ట్రైనర్ సిరిగిరి చలపతిరావు, ఎంపీడీవో వై భాగ్యవతి పాల్గొన్నారు. ఈ పోటీలలో 19 సంవత్సరాలకు పైబడిన జూనియర్ గ్రూప్ వారు గరుడాసనము, ప్రాణాయామం చేశారు. 35 సంవత్సరాలకు పైబడిన వారు పురుషుల బ్యాచ్‌లో కొన్ని యోగాసనాలు చేశారు. యోగ గురువు పర్యవేక్షణలో కార్యక్రమాలన్నీ జరిగాయి. కాంపిటీషన్స్ ప్రారంభానికి ముందు ఐసిడిఎస్‌కు సంబంధించిన మండలంలోని టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు కాంపిటీషన్స్‌లో పాల్గొను వారు వీరందరితో ఎంపీడీవో ఒక సమావేశం ఏర్పాటు చేసి యోగాసనాల గురించి ఏడవ తేదీ వరకు జరగబోవు కాంపిటీషన్స్ గురించి ప్రభుత్వం వీటిపై విడుదల చేసిన మార్గదర్శకాల గురించి తెలియజేశారు.

# వెదుళ్ళ చెరువులో శ్రీ పట్టాభి రామస్వామి

## నూతన విగ్రహ కుంభాభిషేకం







(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 3)

వెలిగండ్ల మండలం వెదుళ్ళ చెరువు గ్రామం నందు నూతనంగా శ్రీ పట్టాభిరామ స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు. నాలుగోవ తేదీన గొప్ప పౌరాణిక నాటక ప్రదర్శనలు భక్త చింతామణి లవ్ (శీను) బావ పాత్రలో నెల్లూరు గంగాధర్‌రెడ్డి, శ్రీ రామాంజనేయ యుద్ధం శ్రీరామ పాత్రలో తరుణవాయి పెంచలయ్య, శ్రీ ఆంజనేయ పాత్రలో పైడిరాజు విజయనగరం, సత్య హరిశ్చంద్ర వారణాసి శీను నుండి కాటిసీను వరకు హరిశ్చంద్ర పాత్రలో రామ బ్రహ్మారెడ్డి, ఒంగోలు రెండవ హరిశ్చంద్ర బీరం శ్రీనివాస్‌రెడ్డి, అభినవ డివి చంద్రమతి, పాత్రలో నెల్లూరు భానుమతి నక్షత్ర పాత్రలో జయరావు, కావలి కాల కౌశిక పాత్రలో శేషయ్య, కావలి శివుడి పాత్రలో రత్తయ్య వంటి గొప్ప కళాకారులచే గొప్ప పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించబడతాయని తెలిపారు. కావున నియోజకవర్గంలోని ప్రజలందరూ తరలివచ్చి ఈ మహత్తరమైన ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

## నేషనల్ బీచ్ కబడ్డీ రిఫరీగా శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 3) ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన సాధం శ్రీనివాసరావు జూన్ 5వ తేదీ నుండి 8 తేదీ వరకు మంగినపూడి బీచ్, మచిలీపట్నంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ నిర్వహిస్తున్న జాతీయస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు సాదం శ్రీనివాసరావు ఎంపికైనట్లు రెఫరీగా ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నాకు ఈ అవకాశం ఇచ్చి ఈ స్థాయికి తీసుకొచ్చిన ఎలమంచిలి శ్రీకాంత్ కి ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ రెఫరీస్ బోర్డ్ చైర్మన్ బి మురళి కుమార్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ రిఫరీస్ బోర్డ్ కన్వీనర్ పి రవీంద్ర బాబు, మా గురువు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుర్ర భాస్కరరావు, సెక్రటరీ వై పూర్ణ చంద్రరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# దళిత హోం మంత్రి అనిత వ్యాఖ్యలు చట్టవిరుద్ధం

## తెనాలి దళిత యువకుల పై ఖాకీ దమనకాండ పై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చే విచారణ జరిపించాలి
## తెనాలి 2 టౌన్ సిఐ రాములు నాయక్, 3 టౌన్ సిఐ రమేష్ బాబులను అరెస్టు చేయాలి
## జనసేన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మంత్రి వర్గం నుంచి చంద్రబాబు నాయుడు తొలగించాలి
## అద్దంకిలో దళితుల ఆత్మరక్షణ ర్యాలీలో దళిత నేత నీలం డిమాండ్





(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 3)

దళిత న్యాయదేవత రాజ్యాంగ నిపుణురాలు మాజీ ఉపాధ్యాయురాలు ప్రస్తుత హోం మంత్రి అనిత తెనాలి దళిత యువకులపై పోలీసు అధికారులు చేసిన రాజ్య హింసపై కూటమి ప్రభుత్వం చేసిన కుట్ర పూరిత వ్యాఖ్యలు చట్ట విరుద్ధం రాజ్యాంగ వ్యతిరేకమని నీలం నాగేంద్రరావు మండిపడ్డారు. మంగళవారం అద్దంకి అంబేద్కర్ భవన్ నుండి అద్దంకి పట్టణంలో తెనాలిలో దళిత యువకులపై జరిపిన తాలిబన్ తరహా కూటమి ప్రభుత్వ ఖాకి ధమనకాండపై అద్దంకిలోని అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ తెనాలి దళిత యువకులపై స్థానిక మంత్రి నాదెండ్ల మనోహర్ కుట్ర పూర్వకంగా జరిపించిన పోలీస్ అనాగరిక దాడి జరిపించారన్నారు. మూడు నెలల క్రితం తెనాలి అయితా నగర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని పోలీసులు మున్సిపల్ అధికారులచే అధికార బలంతో తొలగించాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మరియు తెనాలి మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రయత్నించారన్నారు. కానీ స్థానిక దళితుల ఆందోళనలతో ఆ ప్రయత్నం నీరుగారి పోయిందన్నారు. ఆ ఘటనలో పోలీస్ అధికారులకు స్థానిక దళితులకు మధ్య వివాదం నెలకొందన్నారు. చిరంజీవి అనే విశ్వాసమైన పోలీస్ కానిస్టేబుల్ తో ఫిర్యాదు తీసుకొని పోలీస్ మామూళ్ల కోసం వేధించి తెనాలిలో దళిత, ముస్లిం యువకులపై తెనాలి 2 టౌన్ సిఐ రాములు నాయక్, 3 టౌన్ సిఐ రమేష్ బాబులు తాలిబన్ తరహా పోలీస్ శిక్ష వేశారన్నారు. ఒంగోలులో తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్య చౌదరిని కిరాతకంగా హత్య చేసిన తెలుగుదేశం పార్టీ నాయకుల్ని పోలీస్ అధికారులు నడిరోడ్డుపై కొట్టక పోగా అరెస్టు చేసినప్పుడు కూడా మీడియా సమావేశంలో మోకాలు చూపించకుండా ముసుగువేయటం కుల వివక్ష కాదా అన్నారు. విశాఖపట్నంలో డాక్టర్ సుధాకర్ను నడిరోడ్డుపై పోలీసులు దాడి చేసి కొట్టినప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న అనిత డాక్టర్ సుధాకర్ ఇంటికి వెళ్లి పరామర్శించలేదా అని ప్రశ్నించారు. నేరానికి పోలీసు శిక్షలకు కూడా కులం ఉంటుందని హోం మంత్రి అనిత గుర్తించాలన్నారు. హోం మంత్రి అనిత ఉపాధ్యాయులు రాలే కానీ రాజ్యాంగ నిపుణురాలు కాదని న్యాయ శాస్త్రం చదవలేదని తెలుసుకోవాలన్నారు. చట్ట ప్రకారం పోలీసులు కేసు నమోదు చేస్తే కోర్టులు శిక్షలు విధించాలి కానీ శిక్షలు విధించే అధికారం ఏ ప్రభుత్వంలోనైనా పోలీసులకు లేదన్నారు. కేవలం తాలిబన్లు మాత్రమే బహిరంగ శిక్షలు వేస్తారు అన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన రఘురామకృష్ణరాజును ఆనాటి ప్రభుత్వం బహిరంగంగా నడిరోడ్డుపై కాకుండా సి బి సి ఐ డి కార్యాలయంలో అరికాళ్ళ కోటింగ్ ఇస్తే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఘటనకు బాధ్యుడిని చేస్తూ డీజీపీ హోదాలో ఉన్న పీవీ సునీల్ కుమార్ ను ఎందుకు సస్పెండ్ చేశారన్నారు. కావున నేరానికి పోలీస్ శిక్షలకు కులం ఉంటుందని తెలుగుదేశం న్యాయదేవత రాజ్యాంగ నిపుణురాలు హోం మంత్రి అనిత తెలుసుకోవాలన్నారు.

తెనాలి దళిత యువకులపై ఖాకీ దాష్టీకం చేసిన తెనాలి సిఐలు రాములు నాయక్ మరియు రమేష్ బాబులను ఎస్సీ ఎస్టీ ప్రకారం అరెస్టు చేయాలన్నారు. తెనాలి దళిత యువకులపై కుట్ర పూరక ఖాకి దాడి జరిపించిన సనాతన స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయ గురువు నాదెండ్ల మనోహర్ ను మంత్రివర్గం నుండి తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ని డిమాండ్ చేశారు. మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, అద్దంకి నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షులు అంకం కిరణ్ కుమార్, కాకుమాను రవి ఈ నిరసన కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకా యానాది సేవా సమితి నాయకులు పోలా జీవరత్నం, ఆదినారాయణ ఎమ్మార్పీఎస్ నాయకులు యోహాన్, అంబేద్కర్ పోరాట వేదిక కన్వీనర్ ఎర్రమల శ్రీనివాసరావు, గొడ్డటి రవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ వలీసాహెబ్ పుట్టినరోజు వేడుకలు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జూన్ 3)





మీడియా రంగంలో నిబద్ధతతో సేవలందిస్తున్న సీనియర్ పాత్రికేయులు, ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు, డాక్టర్ షేక్ వలీసాహెబ్ 50వ పుట్టినరోజు వేడుకలు మంగళవారం స్థానికంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు, తోటి పాత్రికేయులు, మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై వలీసాహెబ్ ను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పూలమాలలు, బొకేలు అందించి, అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ, వలీసాహెబ్ అనేక సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజలకు న్యాయం జరిగేలా చేసిన సాహసోపేతమైన పాత్రికేయుడు. అని కొనియాడారు. చిన్నవాడా, పెద్దవాడా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ తన కుటుంబసభ్యుల్లా భావించి, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని ప్రశంశించారు.వలీసాహెబ్ పాత్రికేయతకు నిలువెత్తు ఉదాహరణ అని పేర్కొన్నారు. ఏ వార్తలు వదలినా, వాస్తవాలను పరిశీలించి, వారిజల పక్షాన నిలబడి న్యాయం జరిగేలా ప్రయత్నించేవారు. ఆయనకు విలువలు, నిజాబుకి ప్రధానంగా (లిచాయి అని కొనియాడారు. అనంతరం షేక్ వలీసాహెబ్ మాట్లాడుతూ జర్మలిజం అనేది కేవలం ఉద్యోగం కాదు. ఇది ఒక నిబద్ధతతో కూడిన ధర్మవాధ్యక ఇది కత్తిమీద సాము లాంటిది. ఒకవైపు ప్రభుత్వ యంత్రాంగం, మరోవైపు ప్రజల వార్తలు మధ్య సమతుల్యతను పాటించాల్సిన బాధ్యతా రంగం. విలువలతో కూడిన పాత్రియతే నిజమైన జర్మలిజం అని స్పష్టం చేశారు. హోదాల కోసం కాదు, ప్రజల కోసం పని చేయాలి. ముఖ్యంగా పేద, అణగారిన వర్గాల సమస్యలపై జర్నలిస్టులు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు టీవీ9 జాజీ, ఉపాధ్యక్షుడు కొటేష్, ఆంధ్రప్రభ, మాజీ అధ్యక్షుడు టీవీ5 రసూల్ ఖాన్, క్రమశిక్షణ సంఘం సభ్యులు బిగ్ టీవీ నాగేష్, అనంతభూమి యేసేబు, ఆర్టీవీ మల్లికార్జున, హెచ్ఎంటీవీ మణి, జర్నలిస్టులు షేక్ నాసర్ వలి, రవుఫ్, మారపాకుల ఆంజనేయులు, ఆలేటి అనిల్, కంచి బాలు, కొలుకులూరి కృష్ణయ్య, ఆవుల యేసుబాబు, తదితరులు పాల్గొన్నారు.



**గ్రామీణ వైద్యుల సన్మానం :** యర్రగొండపాలెం నియోజకవర్గ గ్రామీణ వైద్యుల సంఘం గౌరవ అధ్యక్షులుగా కూడా పనిచేస్తున్న డాక్టర్ షేక్ వలి సాహెబ్ ను ఆయన పుట్టినరోజు సందర్భంగా గ్రామీణ వైద్యులు ఘనంగా సన్మానించారు. శాల్వాలు, పూలమాలలతో సత్కరించారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ పల్లె పోగు జాషువా, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఈర్ల కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ కోట శాంసంగ్ తదితరులు పాల్గొన్నారు.



# వంటల పోటీలు

(షణ్ముఖ వెలుగు, నూజెండ్ల, జూన్ 3)

మండల పరిధిలో గల ప్రభుత్వ పాఠశాల నందు పనిచేయుచున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన నిర్వాహకులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూజెండ్ల నందు మండల విద్యాశాఖ అధికారి నలబోలు రవిచంద్ర అధ్యక్షతన ఒక రోజు శిక్షణ కార్యక్రమం, వంటల పోటీలు నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థికి పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, భోజన తయారీలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట వండేటప్పుడు పోషకాలు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ సంవత్సరం నుండి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు. తదనంతరం వంటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవిచంద్ర, రిసోర్స్ పర్సన్ పద్మావతి, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఆఫీసు సిబ్బంది, పాల్గొన్నారు.





# సూర్యాస్తమయ వేళ

కొత్తపట్నం పటములపై, ఆకాశం ఆరని రంగుల దీపావళి,
ఫ్లైఓవర్ పై నిలుచొని చూచితిని-
అస్తమించు సూర్యుని అద్భుత స్వర్ణ కాంతి !
ఎగిసే కెరటాల కన్నీటి మీద
అలల వెంట నడిచిన సూర్య తేజం
నెమ్మదిగా నిలిచి, ఆకాశాన్ని ఆలింగనించినపుడు
హృదయం ఓ క్షణం ఆగిపోయినట్లు....
ఎరుపు-ఆరెంజ్ చలవల ముసురుతో,
ఆ కిరణాల కవిత్వం పలికింది :
"నన్ను వీడకముందు, ఒక్క చూపు చాలు,
ఈ రోజు చివర చూపుగా నిలుస్తాను !"
ఆ పొడవాటి వంతెనపై నలిగిన నీడలు
సూర్యుని తలపిస్తూ సాగిపోతుండగా,
ప్రకృతి ఓ చిత్రకారుడు అయి
వెలుగును నెమ్మదిగా అంధకారంలో ముంచింది.
చిరస్మరణీయమైన ఆ సాయంతనపు దృశ్యం-
సూర్యుడు అస్తమించిన చోట,
నా హృదయంలో మాత్రం
తేజస్వి కిరణంగా నిలిచిపోయింది....

(ఉబ్బా అశోక్, షణ్ముఖ వెలుగు స్టాఫ్ ఫొటో గ్రాఫర్, ఒంగోలు)

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com